# ప్రౌఢ వ్యాకరణం |

జమాన్‌కి యజమానికి, అట్టే తేడాలేదు. మాంచి ఒడ్డూ పొడుగూ వుండేమనిషిని జమాన్ అంటారు- అంభేరురాలులావున్న మనిషినికూడా ఆవిడ మంచి జమాన్ అంటారు. కనుక యముడి చెల్లెలు అయినా కాకపోయినా జమాన్‌రాలు యజమానురాలు అయి తీరుతుంది. యింటికి యముడులాటి జమాన్ కాబట్టి అతగాడు యజమాన్ అవుతాడు, సో_ ఎవ్వెరి గృహభార్య వంటింటి మహాలక్ష్మి .... రాట్సు కాట్సు అండ్ డాగ్స్‌తో పేచీలు పడని గృహలక్ష్మి భూస్థలమంతా వెదికినా దొరకదు. మనిషిగారి మంచి స్నేహితుడైన కుక్క- దాని విరోధి పిల్లి, పిల్లికి మెడలో గంటకట్టలేని ఎలుక యివి అన్నీ ఇల్లాలిప్రాణం విసిగించేస్తూంటాయి.

బై ది బై బొద్దెంకలు, చీమలు (కండ వితవుట్ కండ) ఈగలు, దోమలు అన్నీ హవుస్ వైఫ్‌గార్ని వేపుకుతినేవే, కాకులు ఇవి ఇల్లాండ్రను అస్సలే కేర్ చెయ్యవు. సబ్బిళ్ళలూ నేతిగరిట్సూ చమ్చాలు ఎత్తికెళ్ళి యిక్కడివక్కడ అక్కడివిక్కడా సర్దేస్తూ గొప్ప ట్రబుల్స్ క్రియేట్ చేస్తూంటాయి.

కోతులైతే, కాలేజీఅమ్మాయిల్ని కొంగుపుచ్చుకులాగి తల్లో పూలు వాసన చూస్తాయికూడా. స్త్రీలు కర్ర పుచ్చుగున్నా కోతులు డామ్ కేర్ మాస్టర్లు.... "పిల్లా తగ్గు" అంటాయి. ఫెయిర్ సెక్సంటే అన్‌ఫెయిర్ సెక్సుకి ఎప్పుడూ లోకువే! వెంటిలేటర్లో గూళ్లుపెట్టి కాపర్జేసే పిచికలుంటాయి చూశారూ, అవి రెంటూ కరెంటుఖర్చు లేకుండా రేడియో, ఫాన్ అన్నీ ఎంజాయి చేస్తూంటాయి. మన బాత్రూంలో స్నానాలు

చేస్తూంటాయి. "వీళ్ళింకా నిద్రపోరేం చెప్మా" అన్నట్లు గదిలో హాల్లో కిచకిచమంటూ పిచిక తిట్లుతిడతాయి. కొత్తగా కాపురానికొచ్చిన అమ్మడి మొగుడు చనువుగా దగ్గరకు తీసుకుంటే "అవిగో పిచికలు చూస్తున్నాయి, అదుగో పిల్లి మనకేసే చూస్తోంది, కుక్క మన్ని అబ్జర్వు చేస్తోంది" అంటూ వూహూ సిగ్గుపడిపోతుంది. మగాడు రాస్కెల్ గదా-యిలాటి సిగ్గులూ ఎగ్గులూ భయాలు వాడికుండవు. "సిల్లీగర్ల్"అని నెత్తిమీద ఓటిచ్చుగుంటాడు. ముద్దెట్టుకుంటే పిచికలు చూస్తున్నాయనే అమ్మడు, అద్దం దగ్గరకు రమ్మంటే వస్తుందా. మునుపు అద్దాలు అందుబాటులో లేనపుడు ఒకరి కళ్ళల్లో కొకరు చూసుగునేవారు. అఫ్కోర్సు యిప్పుడుకూడా చూసుకుంటారు కనుకే ఎంకి- అద్దమేలంటాది అందాలు తెలువ.

పడగ్గదిలో దేముళ్ళ పటాలుంటాయి గదా, క్యాలెండర్లుంటాయి, మూంచి పిక్చర్లుంటాయి, కొండొకచో బొమ్మలుంటాయి, అవి అన్నీ చూస్తున్నట్లు కనిపెడుతూన్నట్లు మనకనిపిస్తుంది. వాతావరణాన్నంతటినీ జయించగల "ఎమోషన్" అమ్మడికి రావాలికదా. తమలపాకు చిలకలు చుట్టిస్తే ఫలారాలు ఒకొక్కటి కొరుక్కు తింటే- ఆ కబుర్లూ యీ కబుర్లూ చెప్పుగుంటూ నవ్వుకుంటూ సరదాగా "త్వమేవాహం" స్టేజివచ్చేవరకూ కథ నడపాలి. నడిపిస్తే కొన్నాళ్ళపాటు రోజుకో కొత్త "థాం" వుండనేవుంటుంది. డిస్కవరీ ఆఫ్ ఇండియాలాగ ఎవరిజీవితాల్ని వాళ్ళే డిస్కవర్ చేసుగోవాలి. మనుషుల్ని చూస్తుంటే కాపురంచేసే అమ్మాయికి బిడియం ఎలానూ తప్పనిసరి. అచేతనమైన వస్తువుల్ని చూసినా గదిలోకూడా అమ్మాయికి బిడియమే వుంటొచ్చు.

చీకట్లో భయం వెల్తుర్లో సిగ్గూ, చప్పుళ్ళు వింటే గుండె గుభేల్ గుభేల్మంటుంది. మనసిచ్చి మనువాడిన మగవాడి ఎదట మసలుకోడానికే అమ్మడికి ఎంతో బెదుగ్గా వుంటుందికదా— "కొత్తకుండ నీరు తీపి కోరినా మగవాడు తీపి"- అవుననుకోండి, మరీ మోటుతనం పనికిరాదు.

సరసానికే పువ్వులా ముడుచుకొనిపోతుంది తెలిసీ తెలియని బాల. అటువంటి బాలామణిని కులకాంతగా తీర్చిదిద్దుకునే వరకూ కష్టాలుంటాయి. చీరెల డుగుతుంది, రెవికెల డుగుతుంది, పువ్వుల డుగుతుంది. నగలు చేయిస్తే మురిసిపోతుంది. సినిమాలు, షికార్లు వెంటేసుకుని తిప్పడాలు వీటిసంగతి సరేసరి. ఇన్నోటి సరదాలు సరసాలు తీరడానికి డబ్బుండాలికదా— చిన్నకుటుంబాలన్నీ ఖిన్న కుటుంబాలే— నిత్యావసరాలు గడుపుకోడానికి సరిపడే డబ్బును సంపాయించేసరికి తాతలు దిగొస్తున్నారు. సరదాల్ని సరసాల్ని అణిచేసుకుని, కోరికల్ని చంపేసుకుని, మనసుల్ని మమతల్ని విరిచి పొయిలోపెట్టి బ్రతకాలి సొస్తోందన్నమాట నిజవేఁ.... అంత చిన్నఅమ్మడికి బ్రతుకులోని యింత పెద్దసంఘర్షణను బోధపర్చడం కష్టవేఁ....

నిరాశా నిస్పృహల గాలి తగలనివ్వకుండా "పువ్వు" లా పెళ్ళాం మనసుని కాపాడుకోగలిగినవాడు ''వాడేపో మగవాడు.'' మంచికి మర్యాదకు, మనసు యిచ్చి పుచ్చుకోవడానికి, శుచిశుభ్రతకు, ఆరోగ్యానికి కుటుంబసుఖజీవనానికి డబ్బుతో సంబంధంలేనట్లు పైకి కనపడినప్పటికీ, సిరులకూ సింగారానికి అంతర్వాహినిగా సంబంధం వుండబట్టే సొసైటీలో ఆరోగ్యం ఐశ్వర్యమూ ఒకరికి, అనారోగ్యం బాధలూ కష్టాలూ మరొకరికి సంప్రాప్తమవుతున్నాయి. మనకంట్రీలో ముఖ్యంగా హెల్తూ ఎడ్యుకేషనూ నేషనలైజ్ చేయాలి. మద్యనిషేధంకాదు. ఆదల్లా వుండనివ్వండి. జపం విడిచి లొట్టల్లో పడ్డట్లున్నాం. మొగుడూ పెళ్ళాలకు మధ్యనిషేధాలుండకూడదు. ఆ మాట సబబే. రైటంటే రైటు....

"బాలామణి, యువతిగా, కులకాంతా తిలకమయేసరికి జీవితంలోని గడ్డువాస్తవికత ఆవిడ్ని కొరుక్కు— తినకుండావుంటె '' ఆత్మసౌందర్యం మాత్రం మిగిలి వుంటుంది. బాహ్యసౌందర్యం అంతరించిపోతుంది ఎల్లాగూ'' వెనక్కి— చూసుకుంటే మనోహరమైన గతానికి వారసురాలైన ఆ యిల్లాలు వర్తమానాన్ని మర్చిపోయి గతాన్నే ప్రేమిస్తూ జీవిస్తుంది.

అప్పుడు పూజలూ, వ్రతాలూ, ఆచారాలూ, మళ్ళా తళ్ళా లావయి ఆ అబలానారీ శిరోరత్నము పతివ్రతా తిలకమయి ఫామిలీ సెంటిమెంటుకు చెరగని దోభీ మార్కులా మిగిలిపోతుంది.

ఆవిడగారి ధ్యాస, పిల్లిమీదా ఎలకమీదా తలుపు తోసుకునొచ్చే బ్లడీ కుక్కమీదా తప్ప మొగుడుమీదా కాపురంమీదా వుండటానికి ఎసుమంటి ఆస్కారమూలేదు. అప్పుడా వంటింటిమహాలక్ష్మికి తను అమ్మడుగా మసిలిన రోజులు గుర్తుకొచ్చి నవ్వుతెప్పిస్తాయి.

"దివాకా కరుద్భీతా రాత్రౌ తరతి నర్మదా" అన్నట్లు ( రాత్రిళ్లు మొగుడితో సెకండు షో సినిమాకు తుఫానులోనైనా జడియక రిక్షాలో చెక్కేయకలిగిన కడు ధైర్యవంతురాలైనప్పటికీ ) పగలు మాత్రం ఎలకను చూసో(కుక్క సంగతి సరేసరి) పెళ్లి ముందు అత్తగార్ని తరువాత లావుపాటి పెద్దవ్తైజు ఆడబడుచుని, తరవాత్తరవాత మొగుడ్ని గట్టిగా కరిచిపట్టుకున్నరోజులు గుర్తుకొచ్చి నవ్వుతెప్పిస్తాయి. ''దీనికింత భయమేవిటి చెప్మా'' అని తనకు మహా ప్రసాదంగా కలిగిన ఆయాచిత సౌఖ్యానికి మొగుడు తప్ప మరెవరూ మెచ్చుకోరు. కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు కోమలుల సౌరెక్కునా .... ఎక్కదు.

గిరీశంగారన్నట్లు "అలాంటి చీమల్ని చూసి కప్పల్ని చూసి ఎలకల్ని చూసి అస్తమానూ భయపడే పిరికి (పడుచు) పిల్లల్నిచూసి పెళ్ళిచేసుకుంటే చెప్పావుమజా"- అస్తమానూవచ్చి వాళ్ళోపడ్తుంటారు. అదృష్టం వాలడం అంటే అదేనోయ్- వెర్రివాడా ! కుర్రవాడా!

శృంగారానికి టూమచ్చని ఏదైనా వుందా అని నా కో డవుటు. కోరికలు పొంగిపొర్లే యౌవనంలో చన్నీళ్ళ స్నానంచేసి తడిచీర చుట్టుకుని తులసి కోటచుట్టూ, ఆవుచుట్టూ తిరిగి బొజ్జెంకల దేవుడికి పూజచేయాలంటే ఈ రోజుల్లో ఇంఫాసిబుల్. పైదిబై యువాళ బాల వ్యాకరణం చెబుదామని కూర్చుంటే తీరా అది ప్రౌఢ వ్యాకరణం వతుగా తయారయింది ఎస్సే - ఆల్ రైట్ .... ఐడోంట్ కేర్ ! కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు కోమలుల సౌరెక్కునా (కొయ్య బొమ్మలు పాఠకీ పాఠకులు కారని గమనించ ప్రార్థన) ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !